ప్రభుత్వ ఆస్పత్రుల్లో సదుపాయాల కల్పనకు కృషి

- డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ ఎడ్యుకేషన్ శివరాంప్రసాద్

రోగులతో మాట్లాడుతున్న శివరాంప్రసాద్

నీలగిరి, మార్చి12 : ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ఖాళీగా ఉన్న వైద్యులు, ఇతర పోస్టులను నెల రోజుల్లో భర్తీ చేసి మెరుగైన వైద్యసేవలు అందిస్తామని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ శివరాంప్రసాద్ అన్నారు. బుధవారం నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఆయన సందర్శించారు. ఐసీయూ, క్యాజువాలిటీ, ఎంసీహెచ్‌తో పాటు జనరల్ వార్డుల్లో తిరుగుతూ రోగులు, వారి సహాయకులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెడికల్ కళాశాలను సందర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లు, ఇతర సిబ్బందితో పాటు పారిశుధ్య, సెక్యూరిటీ వంటి అన్ని రకాల పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అందుకోసం ప్రత్యేకంగా నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. రెండు మూడు రోజుల్లో 80 మంది సీనియర్ ఫ్యాకల్టీలను కౌన్సెలింగ్‌కు పిలిచి అర్హులను ఎంపిక చేసి ఆస్పత్రులకు కేటాయించనున్నట్లు తెలిపారు. సిబ్బందిని పెంచడంతోపాటు అన్ని రకాల మందులను కూడా అందుబాటులో ఉంచుతామన్నారు. ఆస్పత్రిలో పడకల కంటే అధికంగా రోగులు వస్తున్నారని, అందుకు తగిన ప్రణాళికలు త్వరలో రూపొందిస్తామన్నారు. నల్లగొండ జనరల్ ఆస్పత్రిలో 550 పడకలుండగా అందుకు తగిన సిబ్బంది, వైద్యులు లేకపోవడం వల్ల కొంత ఇబ్బంది అవుతుందన్నారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నగేశ్, ఐసీయూ ఇన్‌చార్జి డాక్టర్ రమేశ్ ఉన్నారు.

సాగు నీటిని వృథా చేయవద్దు : కలెక్టర్ ఇలా త్రిపాఠి

గుర్రంపోడ్‌లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

గుర్రంపోడ్, మార్చి12: రైతులు సాగునీటిని వృథా చేయవద్దని, ప్రస్తుతం యాసంగిలో సాగు చేసిన పంటలు ఎండిపోకుండా ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందించేందుకు జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలకు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. బుధవారం గుర్రంపోడు, కనగల్ మండలాల పరిధిలో డీ-25 కెనాల్‌ను తనిఖీ చేశారు. ఈ కాల్వ కింద చివరి భూముల వరకు సాగునీరు అందుతున్నదా అనే విషయాన్ని పరిశీలించారు. కురంపల్లి క్రాస్‌రోడ్డు నుంచి మారేపల్లి వరకు కాల్వ వెంట వెళ్లి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి బుధవారం ఎక్కువ నీటిని విడుదల చేసినందున రాత్రి లోపు కాల్వ చివరి వరకు సాగునీరు వచ్చే అవకాశం ఉందన్నారు. కాల్వకు గండ్లు కొట్టడం, నీళ్లు మళ్లించడం వంటివి చేయవద్దని సూచించారు. , వారి పరిధిలో ఉన్న ఫీడర్ ఛానళ్లు, సబ్ మైనర్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకుంటే సాగునీరు సులభంగా వస్తుందన్నారు. నీరు కాల్వ చివరి వరకు అందేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఆమె వెంట ప్రాజెక్ట్ చీఫ్ ఇంజినీర్ అజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, ఈఈ నెహ్రూ, డీఈలు, ఏఈలు, అధికారులు ఉన్నారు.

కేంద్ర పథకాలపై ప్రణాళిక రూపొందించాలి

తిరుమలగిరి(సాగర్) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధర్తీ అబ్ జన్ జాతీయ ఉత్కర్ష్ పథకంపై అధికారులు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం మండలంలోని రంగుండ్ల తండా గ్రామాన్ని సందర్శించి అధికారులకు సూచనలు చేశారు. ఆమె వెంట హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, అధికారులు ఉన్నారు.

అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- 20 తులాల బంగారం రికవరీ

వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ మౌనిక

చందంపేట(దేవరకొండ), మార్చి 12 : అంతరాష్ట్ర దొంగల ముఠాను దేవరకొండ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. దేవరకొండ డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ మౌనిక కేసు వివరాలను వెల్లడించారు. దేవరకొండ పట్టణంలోని మీనాక్షి ప్లాజా వద్ద శీలా వాసు ఇంట్లో గత నెల 19న ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో దొంగలు చొరబడి బంగారు నగలు ఎత్తుకెళ్లారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చోరీకి పాల్పడిన వారు హైదరాబాద్‌లోని పాత బస్తీకి చెందిన అబ్దుల్ జాఫర్ అలియాస్ అహ్మద్, ఫసి, మోసీమ్‌గా గుర్తించి వారిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 20 తులాల బంగారం రికవరీ చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. మరో వ్యక్తి నైజల్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆమె తెలిపారు. సమావేశంలో సీఐలు నర్సింహులు, రమేశ్, కోటేశ్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

కొండమల్లేపల్లి, మార్చి 12 : రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర టెక్నికల్ కో కన్వీనర్ లక్ష్మణ్‌నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు.

రేషన్ బియ్యం దందాకు పాల్పడితే కఠిన చర్యలు

- రాష్ట్ర విజిలెన్స్ ఓఎస్డీ అంజయ్య


మర్రిగూడలో రేషన్ షాపును తనిఖీ చేస్తున్న రాష్ట్ర విజిలెన్స్ ఓఎస్డీ అంజయ్య

మర్రిగూడ, మార్చి 12 : రేషన్ డీలర్లు, వ్యాపారులు రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించి అక్రమ దందాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విజిలెన్స్ ఓఎస్డీ అంజయ్య హెచ్చరించారు. బుధవారం మండలంలోని పలు రేషన్ షాపులను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. స్టాక్‌బోర్డులో బియ్యం నిల్వల వివరాలు నమోదు చేయాలని డీలర్లను ఆదేశించారు. లబ్ధిదారులతో మాట్లాడి రేషన్ బియ్యంలో పోషకాలు అధికంగా ఉంటాయని, వాటిని విక్రయించొద్దని, వాడుకోవాలని సూచించారు. ఎక్కువ ధర ఆశ చూపి ప్రజల నుంచి బియ్యం కొనుగోలు చేసే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట రాష్ట్ర విజిలెన్స్ డీఎస్పీ యాదయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

ఇండియన్ పాస్‌పోర్ట్ పోయినది
ముదిరెడ్డి కాంతమ్మ, W/o. బిక్కారెడ్డి, నాకు సంబంధించిన ఒరిజినల్ పాస్‌పోర్టు నెం. M6347610 గలది ఈదులగూడ నుండి మిర్యాలగూడ MRO ఆఫీస్‌కు బైక్ పై వెళుతుండగా పోయినది. దొరికినవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.
9985019953

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, (గ్రా. చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777630 | చౌటుప్పల్ : 9182777638

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

- అసెంబ్లీ ముట్టడికి వెళ్తుండగా అదుపులోకి
- తమకు రావాల్సిన బిల్లులు అడిగితే అరెస్ట్ సరికాదు : మాజీ సర్పంచులు

మాడ్గులపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఉన్న మాజీ సర్పంచులు

కనగల్‌లో మాజీ సర్పంచులను అరెస్ట్ చేసిన పోలీసులు

కట్టంగూర్ : బీఆర్‌ఎస్ మాజీ సర్పంచ్‌లను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

నీలగిరి, మార్చి 12 : పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని కోరుతూ మాజీ సర్పంచులు బుధవారం చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు మాజీ సర్పంచులను ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించి సాయంత్రం వరకు అక్కడే ఉంచారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. నల్లగొండ మండలానికి చెందిన మాజీ సర్పంచులను నల్లగొండ రూరల్ ఎస్‌ఐ సైదాబాబు ఆధ్వర్యంలో ముందస్తుగా అరెస్ట్ చేసి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు మాజీ సర్పంచులు మాట్లాడుతూ తమను అరెస్టు చేసినంత మాత్రనా సమస్యలు పరిష్కారం కావన్నారు. తాము అప్పులు తెచ్చి పల్లెల్లో అభివృద్ధి పనులు చేశామని, తమకు రావాల్సిన బిల్లులు అడిగితే అరెస్ట్ చేయడం దారుణమన్నారు. అరెస్టు అయిన వారిలో మాజీ సర్పంచులు పబ్బతి రెడ్డి రవీందర్‌రెడ్డి, మామిండ్ల సైదులు, ఎలకా శ్రీనివాస్‌రెడ్డి, జంగయ్య, మేక అరవింద్‌రెడ్డి ఉన్నారు.

నల్లగొండ సిటీ : కనగల్ మండల మాజీ సర్పంచులను పోలీసులు బుధవారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో దోరేపల్లి మాజీ సర్పంచ్ అయితగోని యాదయ్య, మాజీ సర్పంచులు పగిళ్ల యాదయ్య, చెన్నగోని రామచంద్రు, సింగం కోటేశ్, వంగాల భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

నకిరేకల్ : చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న మండలంలోని మంగళపల్లి మాజీ సర్పంచ్ ప్రగడపు నవీన్‌రావును పోలీసులు హౌజ్ అరెస్ట్ చేశారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

మాడ్గులపల్లి : అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మండలానికి చెందిన బీఆర్‌ఎస్ మాజీ సర్పంచులు అలుగుబెల్లి గోవింద్‌రెడ్డి, సైదులు, సింగం శివను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

దామరచర్ల : వాడపల్లి పోలీసులు బుధవారం పలువురు నాయకులను, మాజీ సర్పంచులను అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన వారిలో మాజీ సర్పంచులు లావూరి శ్రీనూనాయక్, దనావత్ ప్రకాశ్‌నాయక్, గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు వాడపల్లి శ్రీరాములు, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సందాల శంభయ్య, సంఘం నాయకులు ఉన్నారు.

త్రిపురారం : చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మండలంలోని అప్పలమ్మగూడెం మాజీ సర్పంచ్ సుశీల్‌నాయక్‌ను ఇంటి వద్ద అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

కేతేపల్లి : పలువురు మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో కొత్తపేట, ఇనుపాముల మాజీ సర్పంచులు బచ్చు జానకిరాములు, జాల వెంకట్‌రెడ్డి, ఉన్నారు.

చందంపేట, మార్చి 12 : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, సర్పంచుల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్నారనే సమాచారంతో చందంపేట మండలానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులను, మాజీ సర్పంచులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు జర్పుల లోక్యానాయక్, నాయకులు గోసుల శివ, బాలవర్ధిరాజు, బలరాం, శ్రీశైలం, తిరుపతయ్య ఉన్నారు.

గ్రామ పంచాయతీ సిబ్బంది అరెస్ట్

నార్కట్‌పల్లి : తమ డిమాండ్లు తీర్చాలని కోరుతూ అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న నార్కట్‌పల్లి గ్రామపంచాయతీ సిబ్బంది బుధవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. స్టేషన్‌కు తరలించి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్ట్ అయిన వారిలో సిబ్బంది వెంకన్న, శంకర్, వెంకటేశం, ఎల్లయ్య ఉన్నారు.

దళిత బంధు లబ్ధిదారులు

శాలిగౌరారం : అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో తమ సమస్యలను పరిష్కరించాలని అసెంబ్లీ ముట్టడి చేసే అవకాశం ఉందని భావించిన పోలీసులు బుధవారం మండలానికి చెందిన దళిత బంధు లబ్ధిదారులను, బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బట్ట చిన్న సైదులు, బట్ట గణేశ్, బట్ట రాజు, కిరణ్, యాదయ్య, తిరుమలేశ్ ఉన్నారు.

నల్లగొండ పోలీసుల అదుపులో ఉన్న మాజీ సర్పంచులు

శాలిగౌరారం : పోలీసుల అదుపులో దళితబంధు లబ్ధిదారులు

నార్కట్‌పల్లి : పోలీసుల అదుపులో ఉన్న పంచాయతీ కార్మికులు

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

- డీఎల్‌పీఓ శంకర్‌నాయక్

మర్రిగూడ, మార్చి 12 : గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని డీఎల్‌పీఓ జె.శంకర్‌నాయక్ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులు, ఉపాధిహామీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎండలు మదురుతున్నందున నీటి సమస్య ఉన్న గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. నర్సరీల్లో మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ జీసీ మునయ్య, ఎంపీఓ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి యూసుఫ్ ఉన్నారు.

20 కిలోమీటర్ల పరిధిలో టోల్ ఎత్తివేయాలి : మట్టిమనిషి

మిర్యాలగూడ రూరల్, మార్చి12 : కోదాడ-జడ్చర్ల రహదారిపై ఆలగడప గ్రామం వద్ద ఏర్పాటు చేసిన టోల్‌గేట్ నుంచి 20 కిలో మీట్ల పరిధిలో నివాసం ఉంటున్న వారి వాహనాలకు టోల్ ఫీజ్ మినహాయించాలని మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు డిమాండ్ చేసారు. బుధవారం ఆలగడపలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవ చూపాలని కోరారు. టోల్‌గేట్ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, నిర్వాహకులు అక్రమ వసూళ్లకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట జనార్దన్‌రావు, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, శ్రీను ఉన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి : ఐద్వా

మిర్యాలగూడటౌన్, మార్చి12: మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి పాదూరి గోవర్ధని అన్నారు. బుధవారం పట్టణంలోని భాగ్యనగర్‌కాలనీలో ఐద్వా ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు నిర్మల, జానకి, శ్రీలత, మాధవి, సునీత, సరస్వతి, రేణుక, భార్గవి, శైలజ, మాధవి, కమలమ్మ పాల్గొన్నారు.

చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా దోటి నారాయణ

చండూరు, మార్చి 12: చండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మునుగోడు మండలం పులిపల్పుల(బీరెల్లిగూడెం) గ్రామానికి చెందిన దోటి నారాయణతో పాటు 17 మంది సభ్యులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. చండూరు మండలం శిర్దేపల్లి గ్రామానికి చెందిన పోలు వెంకట్‌రెడ్డిని వైస్ చైర్మన్‌గా, సభ్యులుగా భూతరాజు ఆంజనేయులు, తలారి నర్సింహ, మొదుగు బాల్‌రెడ్డి, లోదె రవిగౌడ్, మెగావత్ బిచ్చానాయక్, ఉప్పరబోయిన నర్సింహ, కుంభం చెన్నారెడ్డి, నల్లపురాజు రామలింగయ్య, బొమ్మరగోని మంగమ్మ, షేక్ అహ్మద్, కర్నాటి నారాయణ, ఇడికూడ దామోదర్‌తో పాటు గుజ్జ పీఏసీఎస్ చైర్మన్, జిల్లా వ్యవసాయ అధికారి, చండూరు వ్యవసాయ అధికారి, చండూర్ మున్సిపల్ కమిషనర్‌ను నియమించారు. వీరు తమ పదవిలో రెండేండ్ల పాటు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నది.

నేటి నుంచి క్లియో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, మార్చి 12: ఈ నెల 13 నుంచి 24 వరకు పట్టణంలోని క్లియో స్పోర్ట్స్‌లో నిర్వహించనున్న క్లియో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌ను బుధవారం డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్లియో స్పోర్ట్స్ యాజమాన్యం మాట్లాడుతూ క్లియోస్పోర్ట్స్ గ్రౌండ్‌లో మొట్టమొదటిసారిగా ఐపీఎల్ తరహా నిర్వహించే టోర్నీని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు జూన్ 25 నుంచి ప్రారంభమయ్యే తెలంగాణ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌లో పాల్గొనే అవకాశం కల్పిస్తానని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సీఈఓ సునీల్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, మార్చి 12: వ్యక్తిని బ్లాక్‌బెయిల్ చేసి రూ.46 లక్షలకు పైగా వసూలు చేసిన ఇద్దరు నిందితులను బుధవారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రాగడప బీట్‌లో పనిచేసిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌కు తిరుమలగిరి(సాగర్) మండలం గట్టుమీదితండాకు చెందిన ఆంగోతు గణేశ్ పరిచయం కాగా అతడిని హెల్పర్‌గా పెట్టుకున్నాడు. సెక్షన్ ఆఫీసర్ పనుల్లో అతను సహాయపడేవాడు. సదరు సెక్షన్ ఆఫీసర్‌గా రెండేండ్ల క్రితం రిటైర్ అయ్యారు. అతడిని బెదిరించి డబ్బులు వసూలు చేయానే ఆలోచనతో అదను కోసం చూస్తున్న గణేశ్ 2022 జూన్11న సూర్యాపేటలో సెక్షన్ ఆఫీసర్‌తోపాటు మద్యం సేవించాడు. రాత్రి సమయంలో డబ్బులు ఇస్తానని చెప్పి ఓ మహిళను తీసుకొచ్చి మద్యం మత్తులో ఉన్న బాధితుడి వద్ద ఉంచి ఫొటోలు, వీడియోలు తీశాడు. కొద్ది రోజుల తరువాత వీడియోలు, ఫొటోలను సదరు రిటైర్డ్ ఆఫీసర్‌కు చూపించి తనకు డబ్బులు ఇవ్వకుంటే వాటిని కుటుంబ సభ్యులకు చూపిస్తానని బ్లాక్‌మెయిల్ చేయడం మొదలు పెట్టాడు. 2022 నుంచి 2024 వరకు 19 ప్రామిసరీ నోట్ల మీద సదరు అధికారి సంతకాలు తీసుకొని వాటిని బాధితుడి కూతురు, అల్లుడికి చూపించి రూ.46లక్షలు వసూలు చేశాడు. గణేశ్ భార్య ప్రమీల, బావమరిది కుర్ర శంకర్ కూడా వారిని బెదిరించి రూ.2.55లక్షలు వసూలు చేశారు. గత నెలలో మరో రూ.3 లక్షల ఇవ్వాలని వారు బెదిరించసాగారు. దాంతో బాధితుడు జరిగిన విషయాన్ని తమ కుటుంబ సభ్యులకు తెలిపి మిర్యాలగూడ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేసి వారి నుంచి ఒక ఎర్టిగ కారు, స్మార్ట్ ఫోన్, 4.5 తులాల బంగారం, పది ప్రామిసరీ నోట్లు, 9 జిరాక్స్ ప్రామిసరీ నోట్లు రికవరీ చేశారు. నిందితుడు గణేశ్ ఇంతకు ముందు ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి కాపర్ వైర్లను దొంగతనం చేయగా అతడిపై ఆరు కేసులు నమోదైనట్లు తెలిపారు. గణేశ్‌పై త్వరలో రౌడీషీట్ ఓపెన్ చేయనున్నట్లు పేర్కొన్నారు. టూటౌన్ సీఐ నాగార్జున, ఎస్‌ఐలు హరీశ్‌రెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

సంకల్ప్ అమలుకు ప్రణాళికలు రూపొందించాలి : అదనపు కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నల్లగొండ, మార్చి 12: నైపుణ్య శిక్షణ కార్యక్రమాల కోసం పక్కా ప్రణాళికలు రూపొందించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అధికారులకు సూచించారు. స్కిల్ అక్విజేషన్, నాలెడ్జ్ అవేర్నెస్ ఫర్ లైవ్లీహుడ్ ప్రమోషన్ కార్యక్రమంపై జిల్లా ఉపాధి కల్పనాశాఖ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ట్రెండ్, డిమాండ్ ప్రకారం అవసరమైన కోర్సుల్లో యువతకు శిక్షణ అందించేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో ఉపాధి కల్పనా అధికారి ఎన్. పద్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లగొండ సిటీ, మార్చి12 : పట్టణంలో 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల నేపథ్యంలో గురువారం పలు ప్రాతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జిల్లా కేంద్రంలోని పద్మావతీకాలనీ, క్రాంతినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు కేవీకేలో కిసాన్ మేళా

త్రిపురారం, మార్చి 12: మండలంలోని కంపసాగర్ కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం జరిగే కిసాన్ మేళాను విజయవంతం చేయాలని ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.శ్రీనివాస్‌రావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, జిల్లాలోని రైతులు, వ్యవసాయ అనుసంధాన వక్తలు హాజరు కావాలని కోరారు.

చండూరు ఎంపీడీఓగా యాదగిరి

చండూరు, మార్చి 12: చండూరు ఎంపీడీఓగా బండారు యాదగిరి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు చండూరులో పని చేసిన రాంరెడ్డి సిద్దిపేట జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో సిద్దిపేట జిల్లా నుంచి యాదగిరి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

కొప్పోలులో మెగా హెల్త్ క్యాంపు

గుర్రంపోడ్, మార్చి 12: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణా సంస్థకు చెందిన సంపూర్ణ సురక్ష కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని కొప్పోలు గ్రామంలో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. మండల వైద్యాధికారి భవానీ చక్రవర్తి గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో మొబైల్ ఐసీటీసీ కౌన్సిలర్ అపర్ణ, కొప్పోల్ ఎంఎల్‌హెచ్‌పీ సంధ్యారాణి, గ్రామ పంచాయతీ కార్యదర్శి గుండగాని సతీశ్ వైద్య సిబ్బంది.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

హాలియా, మార్చి 12 : హాలియా జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు బుధవారం డీఈ ఆంజనేయులు పరీక్ష సామగ్రిని అందించారు. టెన్త్ వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన వారికి నగదు పారితోషికం అందిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో ఎంఈఓ గుండా కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా పోలీసులకు సన్మానం

మహిళా పోలీసులను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

మిర్యాలగూడ, మార్చి 12: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వాసవీ క్లబ్ గ్రేటర్ మిర్యాలగూడ అధ్యక్షుడు మంచుకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మహిళా పోలీసులను, క్లబ్ మహిళా సభ్యులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలు లేనిదే సృష్టి లేదని, వారిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ సెక్రటరీ రంగా శ్రీనివాస్, కోశాధికారి ఇడుకుళ్ల శ్రీనివాస్, మిరియాల శత్రయ్య, మచ్చా సతీశ్, లకుమరపు రమేశ్, రేపాల శ్రీనివాస్, మందలపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాసచారి

మిర్యాలగూడ, మార్చి 12: ట్రాన్స్‌కో డీఈగా శ్రీనివాసచారి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన డీఈ శ్రీనివాససుధీర్ భువనగిరి టెక్నికల్ డీఈగా బదిలీపై వెళ్లగా అక్కడ పనిచేస్తున్న శ్రీనివాసచారి మిర్యాలగూడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ డివిజన్ పరిధిలో లోఓల్టేజీ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

మహిళ హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదు

రామగిరి, మార్చి 12: తన భార్యను హత్య చేసిన వ్యక్తికి జీవితఖైదు విధిస్తూ జిల్లా కోర్టు న్యాయమూర్తి బుధవారం తీర్పు చెప్పినట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని డిండి పోలీసుస్టేషన్ పరిధిలోని చెర్కుపల్లి గ్రామానికి చెందిన మోకురాల నిరంజన్ తన భార్య రాములమ్మలకు పిల్లలు లేక పోవడంతో ఆమె పేరున ఉన్న ఆస్తిని దక్కించుకునేందుకు తన అన్న కొడుకు మొకురాల శేఖతో పాటు మరో ఇద్దరితో కలిసి 5మే, 2019న పొలం వద్ద కత్తులతో దాడి చేసి హత్య చేశాడు. నిరంజన్ బావమరిది చింతపల్లి వెంకటయ్య ఫిర్యాదు మేరకు డిండి పోలీసులు కేసు నమోదు చేసి ఆధారాలు సేకరించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. బుధవారం జరిగిన తుది విచారణలో నిందితుడు మోకురాల శేఖర్‌కు జీవిత ఖైదీతోపాటు జరిమానా విధించినట్లు ఎస్పీ వెల్లడించారు. మిగిలిన ఇద్దరిని నిర్దోషులుగా తీర్పు వెలువరించారు. కేసులో సరైనా ఆధారాలు సేకరించి నిందితుడికి శిక్షపడే విధంగా చేసిన అప్పటి దర్యాప్తు అధికారి డి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఐ కె.భాస్కర్‌రెడ్డి, సురేశ్, డి రాజు, సీడీవో కృష్ణ, లైజన్ అధికారి నరందర్, మల్లికార్జున్‌ను ఎస్పీ అభినందించారు.

బుద్ధవనాన్ని సందర్శించిన ఎస్టీ, ఎస్సీ కమిషన్ చైర్మన్

ధ్యానమందిరంలో కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

నందికొండ, మార్చి 12 : నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని బుద్ధవనాన్ని రాష్ట్ర ఎస్టీ, ఎస్సీ కమిషన్ చైర్మన బక్కి వెంకటయ్య సందర్శించారు. బుద్ధవనంలోని జాతకపార్కు, ధ్యానమందిరం, అవకానబుద్ధ, మహాస్తూపాన్ని సందర్శించారు. ఆయన వెంట ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కుసురం నీలాదేవి, రాంబాబునాయక్, లక్ష్మీనారాయణ, శంకర్, ఎస్సీ సంక్షేమశాఖ పీడీ కోటేశ్వర్‌రావు, గైడ్ సత్యనారాయణ, ఎస్ఐ సంపత్‌గౌడ్, ప్రొటోకాల్ ఆర్ఐ దండా శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

దళితుల సమస్యలపై విన్నపం

నిడమనూరు : నాగార్జునసాగర్‌కు వచ్చిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు రాంబాబునాయక్, జిల్లా నర్సింహను బుధవారం నిడమనూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కామర్ల జానయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటి సత్యపాల్, నాయకులు చిత్రం జీవన్‌రావు కలిశారు. దళితుల సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

హాలియా, మార్చి12 : హాలియాలోని న్యూకిడ్స్ పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా రాణించి అలరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్ మనాది శ్రీలత అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.